సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
శనివారం 1-2-2025
సంపుటి: 20 సంచిక: 263
పేజీలు: 8 వెల: రూ.1

# రథసప్తమికి పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి
- వేడుకల బందోబస్తుపై తుది పరిశీలన



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మూడు రోజులు పాటు జరిగే రథసప్తమి వేడుకలకు ఎటువంటి లోపాలు లేకుండా పకడ్బందీగా భద్రత, బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఆదేశించారు. ఈమేరకు ఎస్పీ పోలీస్ అధికారులతో కలిసి అరసవల్లి రథసప్తమి వేడుకల భద్రత, బందోబస్తు ఏర్పాట్లు శనివారం ఉదయం పరిశీలించారు. ఈ క్రమంలో ముందుగా అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామివారి ఆలయం నలువైపుల సందర్శించి దర్శనానికి భక్తులు వెళ్లే క్యూలైన్లు, టికెట్ విక్రయ కేంద్రాలు, ప్రసాదం కేంద్రం, భక్తుల ఎంట్రన్స్, ఎగ్జిట్ మార్గాలు, ఉచిత దర్శనం క్యూలైన్ వెళ్లే ఇంద్రపుష్కరిణి పరిసరాలను పరిశీలించారు. సామాన్య భక్తులకు ఎటువంటి ఆటంకం లేకుండా పటిష్టమైన బారికేడ్లు ఏర్పాటుచేసి ప్రశాంతంగా భక్తులు దర్శనం చేసే విధంగా చర్యలు - మిగతా చివరి పేజీలో

## మార్చి 3 నుంచి ఓపెన్ స్కూల్
# ఇంటర్మీడియట్ పరీక్షలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 3 నుంచి 15వ తేదీ వరకు జరుగుతాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆ వివరాలు ప్రకారం పరీక్షలు ఆయా తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయి. మార్చి 3న ఇంగ్లీష్, 5న తెలుగు, ఉర్దూ, హిందీ, 7న రసాయన శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, సామాజిక శాస్త్రం, 10న భౌతిక శాస్త్రం, రాజనీతి శాస్త్రం/ పౌర శాస్త్రం, మనోవిజ్ఞాన శాస్త్రం, 12న గణితం, చరిత్ర, వ్యాపార గణాంక శాస్త్రం, 15న జీవశాస్త్రం, వాణిజ్య వ్యాపార శాస్త్రం, గృహ విజ్ఞాన శాస్త్రం పరీక్షలు జరుగుతాయి.




## హాస్టల్ విద్యార్థిని కేసులో
# నిందితుడు దొరికాడు!


(గూగుల్ ఫొటో)

- పోలీసులకు సినిమా చూపించిన బాయ్‌ఫ్రెండ్
- దాడి ఎందుకు చేశాడన్నదానిపై కొనసాగుతున్న దర్యాప్తు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక ఉమెన్స్ కాలేజీలో డిగ్రీ ఫైనలియర్ చదువుతూ ఆవరణలోనే హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థినిపై దాడి చేసిన కేసులో నిందితుడ్ని పోలీసులు 48 గంటలు తిరిగే లోగా అత్యంత చాకచక్యంగా పట్టుకున్నారు. బాధితురాలి కాల్‌డేటా, ఎక్కడో దూరంగా ఉన్న సీసీ ఫుటేజీలో కనిపించిన నీడ మేరకు అనుమానితుడిగా భావించిన పోలీసులు శుక్రవారం నుంచి అనుమానితుడి కోసం వెతకడం ప్రారంభించారు. సెల్‌ఫోన్ లొకేషన్ టవర్ ప్రకారం నిందితుడు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వేగంగా కదులుతున్నాడని ఎక్కడెక్కడికో ప్రయాణించారు. ఎక్కడా ఆచూకీ దొరక్కపోవడంతో ఒక తెలుగుసినిమాలో సన్నివేశాన్ని ఊహించుకొని బహుశా నిందితుడు తన సెల్‌ఫోన్‌ను ఏ వాహనంలోనో పెట్టి తమను ఏమారుస్తున్నాడనే ఆలోచన వచ్చింది. ఆ మేరకే ఓ బస్సులో సెల్‌ఫోన్‌ను కనుగొన్నారు. అయితే నిందితుడు ఎక్కడున్నాడో మాత్రం కనిపెట్టలేకపోయారు. మొబైల్ లభించిన తర్వాత మరిన్ని ఆధారాలు దొరికాయి. దీంతో నిందితుడు సారవకోట మండలం గోవర్ధనపురానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. అక్కడికి పోలీసులను పంపి నిందితుడి తండ్రి - మిగతా చివరి పేజీలో

## సూర్య నమస్కారాలతో
# రథసప్తమికి రేపే శ్రీకారం

- తొలిరోజు ఉదయం 6 నుంచి రాత్రి 10 వరకు కార్యక్రమాలు
- ఉచితంగా వీక్షించేందుకు ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాట్లు
- ఆకర్షణగా నిలవనున్న హెలికాప్టర్ టూరిజం, లేజర్ షో
- రాత్రి 6.30 గంటలకు హైపర్ ఆది స్కిట్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామివారి జయంతి వేడుకలు రథసప్తమి సందర్భంగా మూడు రోజులపాటు కన్నుల పండువగా జరగనున్నాయి. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. తొలి రోజు ఆదివారం ఉదయం 6 గంటలకు సామూహిక సూర్య నమస్కారాలతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. తొలిసారిగా హెలికాప్టర్ టూరిజం అందుబాటులోకి తెచ్చారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు డచ్ బిల్డింగ్, కలెక్టర్ కార్యాలయం దగ్గర హెలికాప్టర్ రైడ్ ఉంటుంది. గ్రామీణ క్రీడా పోటీలు ఉదయం 10 గంటలకు ఎన్టీఆర్ మున్సిపల్ గ్రౌండ్స్‌లో ప్రారంభమవుతాయి. వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, కర్రసాము, సంగిడీలు, ఉలవల బస్తా లిఫ్టింగ్, పిల్లిమొగ్గలు వంటి పోటీలు నిర్వహిస్తారు. విజేతలకు నగదు బహుమతులు అందజేస్తారు.

**శోభాయమానంగా శోభాయాత్ర:**

శోభాయాత్ర మధ్యాహ్నం 2.30 గంటలకు డే & నైట్ జంక్షన్ నుంచి అరసవల్లి ప్రధాన ఆలయం వరకు నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి - మిగతా చివరి పేజీలో

# వార్డెన్ పూర్ణ సస్పెన్షన్ రద్దుచేయాలి

- నిందితుడ్ని కఠినంగా శిక్షించాలి
- కాలేజీ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుచేయండి
- కలెక్టరేట్ ముందు హాస్టల్ విద్యార్థినుల ధర్నా

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఉమెన్స్ కాలేజీ ఆవరణలో ఉన్న బీసీ హాస్టల్ విద్యార్థినిపై దాడి జరిగిన కేసులో వార్డెన్ పూర్ణపై సస్పెన్షన్ రద్దు చేయాలని బీసీ హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థినులు శనివారం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. హాస్టల్ చుట్టూ అనేక లోటుపాట్లు పెట్టుకొని వార్డెన్‌ను బలిపశువును చేయడం సరికాదని, కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులు రద్దు చేయాలని వారు నినదించారు. అలాగే తమ హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థినిపై పాశవికంగా దాడిచేసిన నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఉమెన్స్ కళాశాలకు, దాని ఆవరణలో ఉన్న నాలుగు మహిళా హాస్టళ్లకు ఎటువంటి రక్షణ వ్యవస్థ లేదని, కనీసం వీధిదీపాలు కూడా అక్కడ అమర్చలేదని, సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని తదితర డిమాండ్లతో వీరు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు.



# 'నాక్'గా తప్పించారు!

- ఆర్ట్స్ కళాశాలకు అర్హత లేదని ఫిర్యాదు
- ప్రిన్సిపాల్ మీద కక్షతో గ్రేడ్‌ను అడ్డుకున్న ప్రబుద్ధులు
- సురేఖ బదిలీకి ప్రత్యేక జీవో తెప్పిస్తున్న ఆ నలుగురు
- ఎ-గ్రేడ్ వస్తే పాతుకుపోతారనే కుట్ర

Dear Sir/Madam,
I am writing to formally report several serious irregularities and breaches of protocol that occurred during the NAAC peer team visit to Government Degree College for Men, Srikakulam, on January 23rd and 24th, 2024. The team, led by Prof. Manjunath Thittenamane Rajappa, along with Dr. Jogen and Dr. Santosh, did not adhere to the standard procedures outlined by NAAC.
Specific Issues:
The Principal accompanied the NAAC peer team during their interaction with students in the Computer Science laboratory. This is a clear violation of the NAAC protocol intended to ensure impartiality during the evaluation process.
The student meeting conducted by the peer team involved only 30 students, which is less than 5% of the total student body. Moreover, the majority of students were not given the opportunity to participate in the meeting.
The college canteen was opened solely during the peer team's visit and was closed immediately afterward. A GPS timestamped photo has been attached to document this.
The Principal's dictatorial attitude during the visit has contributed to lowering the standards and has affected the integrity of the evaluation process.
These deviations from the established protocols have raised serious concerns about the fairness and credibility of the NAAC grading process for our institution. If left unaddressed, these actions could damage the reputation of NAAC and undermine the trust in its accreditation process.
We are losing faith in the evaluation process due to such behavior from the NAAC peer team members.
Request:
I respectfully request that NAAC:
Conduct a thorough investigation into these issues and take necessary steps to address the violations.
Take appropriate disciplinary action against those found responsible for the breaches.
Ensure that all future visits strictly adhere to the established protocols.
I am available to provide further details or evidence if necessary. I trust that NAAC will take swift and impartial action to preserve the integrity of its evaluation process.
Thank you for your attention to this matter.
Copies of this mail have been forwarded to:
Prime Minister's Office
The President
University Grants Commission (UGC)
Sincerely,

Government Degree College for Men, Srikakulam




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పక్క ఫొటోలో కనిపిస్తున్న ఇంగ్లీష్ ముక్కల సారాంశం సూటిగా తెలుగులో చెప్పాలంటే.. 'శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలలో పెద్ద ఎత్తున అవకతవకలు ఉన్నాయని, నాక్ బృందం దీని మీద చర్యలు తీసుకోవాలని, వీలైతే నాక్ సభ్యులే దీనిపై ఇన్వెస్టిగేషన్ చేయాలని' అక్రిడేటెడ్ కమిటీకి శ్రీకాకుళం గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఫర్ మెన్ పేరుతో వెళ్లిన ఈమెయిల్ ఫిర్యాదు. పేరు, ఊరు లేకుండా జనవరి 23, 24 తేదీల్లో శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలకు నాక్ గ్రేడ్ ఇవ్వడం కోసం పరిశీలనకు వచ్చిన అనంతరం వెళ్లిన ఫిర్యాదు ఇది. ఇందులో ఫిర్యాదుదారుడెవరో తెలియకపోయినా ఫిర్యాదులో ఉన్న అంశాలు ఏమేరకు వాస్తవమన్న విషయం మరోసారి చర్చించుకుంటే ఆర్ట్స్ కళాశాలకు నాక్ ఎ-గ్రేడ్ రాకపోవడానికి ప్రధానమైన కారణం ఈ ఫిర్యాదేనని వేరేగా చెప్పనక్కర్లేదు. ఎందుకంటే.. తమకు కళాశాల మీద ఫిర్యాదు వచ్చిందని, దీనిపై వివరణ ఇవ్వాలంటూ స్వయంగా నాక్ కమిటీయే ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ మెయిల్‌కు ఒక నోటీసు పంపింది. ఇదే నోటీసు శనివారం కళాశాలలో అధ్యాపకుల వాట్సాప్ గ్రూపుల్లో తిరిగింది. కేవలం ముగ్గురు నలుగురు పని కట్టుకొని కళాశాలకు నాక్ ఎ-గ్రేడ్ రాకుండా అడ్డుకున్నా, మిగిలినవారంతా శక్తివంచన లేకుండా పని చేసినందుకు కృతజ్ఞతగా కళాశాల ప్రిన్సిపల్ శనివారం ధన్యవాదాలు చెప్పే కార్యక్రమం నిర్వహించారు. ఇదే సమయంలో గ్రూపుల్లో ఈ ఫిర్యాదు కనిపించింది. కేవలం ప్రిన్సిపల్ మీద ఉన్న వ్యక్తిగత కక్షల కారణంగా కళాశాలకు ఎ-గ్రేడ్ రాకుండా అడ్డుకోవడం కోసం ఆకాశరామన్నలు ఎప్పట్నుంచో ప్రయత్నిస్తున్నారు. ఇంతవరకు కళాశాల ప్రిన్సిపల్‌నే టార్గెట్ చేసిన దుష్టచతుష్టయం ఈసారి జిల్లా ప్రతిష్ఠకు సంబంధించిన నాక్ గ్రేడను కూడా వీరి స్వార్థానికి బలి చేశారు. పెంకి సురేఖ ఇక్కడ ప్రిన్సిపల్‌గా ఉండటాన్ని మొదట్నుంచి అంగీకరించని కొందరు చాన్నాళ్లుగా ఆమెతో యుద్ధం చేస్తున్నారు. ఎవరిది తప్పు, ఎవరిది ఒప్పు అన్న అంశం ప్రస్తుతానికి పక్కన పెడితే కేవలం సురేఖ మీద ద్వేషంతో నాక్ ఎ-గ్రేడ్ రాకుండా ఫిర్యాదులు చేయడం కంటే దగుల్బాజీ పని మరొకటి లేదని పూర్వపు విద్యార్థులు బాధపడుతున్నారు. సురేఖను ఇక్కడి నుంచి బదిలీ చేయడానికి ప్రత్యేకంగా జీవో - మిగతా చివరి పేజీలో



• ఎడిటోరియల్

# బ్యాంకులున్నది కార్పొరేట్ల కోసమే..

భారతదేశంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు గత పదేళ్లలో 84 శాతం కార్పొరేట్ రుణాలు మాఫీ చేసినట్లు సమాచార హక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నలకు సమాధానంగా వెల్లడి అయ్యింది. ఈ కాలంలో మొత్తం రూ.16.6 లక్షల కోట్ల రుణాలకు గాను 16 శాతం మాత్రమే వసూలు చేశాయి. పౌర హక్కుల కార్యకర్త ప్రఫుల్ పీ సర్దా సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) కింద లేవనెత్తిన ప్రశ్నకు ప్రతిస్పందనగా ఆర్‌బీఐ ఇచ్చిన డేటా ప్రకారం ఏప్రిల్ 1, 2014 నుంచి సెప్టెంబర్ 30, 2024 వరకు భారతీయ బ్యాంకులు రూ.16,61,310 కోట్ల విలువైన రుణాలను రద్దు చేశాయి. ఈ కాలంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఐబీసి కోడ్ వంటి చర్యలు, 2017 తర్వాత తీసుకొచ్చిన విధాన నిర్ణయాల్లో భాగంగా వసూలైన కార్పొరేట్ రుణాలు కేవలం రూ.2,69,795 కోట్లు మాత్రమే అని రిజర్వ్ బ్యాంక్ వెల్లడించింది. ఐర్‌టీఐ సమాధానం ద్వారా ప్రభుత్వ రంగ బ్యాంకులు రూ. 12,08,621 కోట్లు, ప్రైవేటు రంగ బ్యాంకులు రూ. 4,46,669 కోట్లు, పట్టణ సహకార బ్యాంకులు 6,020 కోట్ల రూపాయల రుణాలను రద్దుచేశాయని వెల్లడైంది. ప్రభుత్వ రంగ బ్యాంకులు రూ. 2,16,547 కోట్లు వసులు చేయగా, ప్రైవేటు రంగ బ్యాంకులు రూ.53,248 కోట్లు స్వాధీనం చేసుకున్నాయి. అంటే ప్రభుత్వ రంగమా కాదా అనే దానితో నిమిత్తం లేకుండా అన్ని బాంకుల్లోనూ రికవరీ రేట్లు తక్కువగానే ఉన్నాయి. ఇకపోతే పట్టణ సహకార బ్యాంకుల రికవరీ డేటా అందుబాటులో లేదని ఆర్‌బిఐ వెల్లడించింది. 13,91,515 కోట్ల రూపాయలు ఇంకా వసూలు కాలేదు. మొత్తం రికవరీ రేటు సుమారు 16 శాతంగా ఉంది. నవంబర్ 2024లో లోక్‌సభలో వచ్చిన ఒక ప్రశ్నకు జవాబుగా కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్‌చౌదరి వెల్లడించిన లెక్కల ప్రకారం 2023-24 ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ రైట్-ఆఫ్‌లు రూ.1.7 లక్షల కోట్లకు చేరుకున్నాయి (ఆర్థిక సంవత్సరం 2024). 2020 ఆర్థిక సంవత్సరంలో ఇది 2.34 లక్షల కోట్ల రూపాయలు. అయితే, గత ఐదు సంవత్సరాల కాలంలో ఇదే అత్యంత తక్కువ మొత్తం. ప్రభుత్వ రంగ బ్యాంకులైన పంజాబ్ నేషనల్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అత్యధికంగా రుణాలు రద్దు చేశాయి. ఇందులో ప్రైవేట్ రంగంలో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్ మొదలైన బ్యాంకులు మొదటివరసలో ఉన్నాయి. 2024 సంవత్సరంలో మొత్తం రైట్-ఆఫ్‌లు తగ్గాయి. అయినప్పటికీ, 20 శాతం కంటే ఎక్కువ బ్యాంకులు మునుపటి సంవత్సరం కంటే ఎక్కువగా రుణాలను రద్దు చేశాయి. సాంకేతిక లేదా వసూలు సంబంధిత కారణాల వల్ల ఎక్కువ శాతం రైట్‌ఆఫ్‌లు చోటుచేసుకుంటాయని, రుణాలు రద్దు చేసిన తర్వాత కూడా బ్యాంకులు వాటిని తిరిగి పొందే హక్కు ఉంటుందని, ఎందుకంటే ఈ ప్రక్రియ ప్రధానంగా బ్యాలెన్స్ షీట్‌ల నిర్వహణ కోసం, పన్ను చెల్లింపుల్లో సామర్థ్యాన్ని చూపించటం కోసం అకౌంటింగ్ ప్రాక్టీస్‌గా పనిచేస్తుంది తప్ప రుణాలు రద్దు చేయబడ్డ (రైట్ ఆఫ్) రుణగ్రహీతలను వారి రుణం తిరిగి చెల్లించే బాధ్యతల నుంచి తప్పించదని రిజర్వు బ్యాంకు వివరణ ఇచ్చింది. అయితే, 'అధిక మొత్తాలలోని రుణాలను తిరిగి రాబట్టుకోవటానికి నిర్దేశిత కాలపరిమితి లేకపోవటం వల్ల, లక్షల కోట్ల ప్రజాధనం ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగపడకుండా నిరుపయోగం అవుతోందని, బ్యాంకులు మాత్రం ప్రతి సంవత్సరం ఆకర్షణీయమైన బ్యాలెన్స్-షీట్లను జారీ చేస్తున్నాయని' ఆర్‌టిఐ ప్రశ్నను ఆర్‌బిఐకి దాఖలు చేసిన సర్దా తన స్టేట్మెంట్‌లో పేర్కొన్నారు. 30 ఏళ్ల ఆర్‌బిఐ విధానాలకు అనుగుణంగా, బ్యాంకులు, రుణ సంబంధిత విషయాలను పర్యవేక్షించే వారి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు కలిసి రుణాలను తిరిగి రాబట్టుకోవటానికి సరైన రికవరీ పాలసీని నిర్ణయించాలని కూడా సర్ద అన్నారు. 'ఈ నేపథ్యంలో, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ రుణదాతలపై జవాబుదారీతనం కోసం కఠినమైన నిబంధనలను ప్రకటిస్తారా? అలాగే ఎన్‌పీఏ (నిరర్థక ఆస్తులు)ల రూపంలో బ్యాంకులు కోల్పోయిన మొత్తాలకు బ్యాంకు మేనేజర్లు, ఎగ్జిక్యూటివ్స్ నుంచి బోర్డు డైరెక్టర్ల వరకు బాధ్యులను చేసి, వాటిని తిరిగి రాబట్టుకునేందుకు ఆ మొత్తాలను వారి నుంచి వసూలు చేస్తారా' అని కూడా సర్దా ప్రశ్నించారు. ఆగస్టు 2024లో సమాచార హక్కు చట్టం కింద వచ్చిన వేరొక ప్రశ్నకు భారతీయ రిజర్వు బ్యాంకు స్పందిస్తూ 'గత ఐదేళ్లలో బ్యాంకులు రద్దు చేసిన రుణాలలో కేవలం 18.7 శాతం రుణాలను మాత్రమే రికవరీ చేసుకున్నాయని' చెప్పింది. సెప్టెంబర్ 2024నాటికి ఆర్‌బీఐ వద్ద ప్రొవిజనల్ డేటా మాత్రమే ఉంది. ఆర్‌బీఐ రాష్ట్ర సహకార బ్యాంకులు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల నుంచి సమాచారాన్ని సేకరించనందున, ఆ గణాంకాలను ఇందులో మినహాయించింది. ఇప్పటివరకు అందించిన సమాచారం అంతా బ్యాంకుల ఆఫ్-సైట్ రిపోర్టుల నుంచి వచ్చింది.



అత్యంత భారీ భద్రత, అంతకుమించిన ప్రోటోకాల్‌కు కేరాఫ్ గా నిల్చి హైఎండ్ ఈవెంట్స్‌కు మాత్రమే వేదికయ్యే రాష్ట్రపతి భవన్.. ఇప్పుడో పెళ్లి వేడుకకు ముస్తాబవుతోంది. అవును ఈ ఫిబ్రవరి 12న జరిగే సీఆర్పీఎఫ్ అధికారి పూనమ్ గుప్తా వివాహం రాష్ట్రపతి భవన్‌లో జరగనుంది. అందేంటి.. అంత ప్రత్యేకత అంటారా..? ప్రత్యేకమే కాదు, చారిత్రాత్మకమైన ఘటనగా కూడా చెప్పుకోవచ్చు.

# రాష్ట్రపతి భవన్.. కళ్యాణ వేదికైంది!

పూనమ్‌గుప్తా రాష్ట్రపతి భవన్‌లో పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా పనిచేస్తోంది. ఆమెకు కాబోయే భర్త అవనీష్ కుమార్ జమ్మూకశ్మీర్‌లో అసిస్టెంట్ కమాండర్‌గా పనిచేస్తున్నాడు. అయితే, పూనమ్ గుప్తా సేవలు, ఆమె ప్రవర్తనకు ముగ్ధురాలైన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తన రాష్ట్రపతిభవన్‌ను పూనమ్ జీవితాంతం గుర్తుంచుకునేలా పెళ్లి వేదికగా మార్చి అద్భుతమైన బహుమతినిచ్చారు. పూర్తి భద్రతా తనిఖీలు నిర్వహించి వరుడు, వధువు కుటుంబాల సభ్యులు, ఇతర స్నేహితులతో లిమిటెడ్ మ్యారేజ్ ఈవెంట్‌గా పూనమ్ పెళ్లి వేడుకను ఏర్పాటు చేశారు.

అయితే, గతంలోనూ ఇలాంటి ఆకట్టుకునే ఓ ఘటన జరిగింది. 2020 జనవరి నెలలోనూ ఓ పెళ్లి వేడుకకు రాష్ట్రపతి భవన్ వేదికైంది. అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ జోక్యంతో అప్పుడా పెళ్లి జరిగింది. అమెరికాకు చెందిన ఆష్లే హాల్ కొచ్చిలోని ఫైవ్‌స్టార్ హోటల్‌లో వివాహం చేసుకోవాలని ప్లాన్ చేసింది. ఏర్పాట్లన్నీ పూర్తయ్యాక ఆ సమయంలోనే అక్కడ రాష్ట్రపతి కోవింద్ పర్యటనకు వెళ్లడంతో.. ఆ హోటల్‌ను రాష్ట్రపతి భద్రత కోసం ఆల్రెడీ రిజర్వ్ చేశారు కాబట్టి.. పెళ్లికి తమ హోటల్‌లో వీల్లేదని యాజమాన్యం చెప్పేసింది.

దాంతో ఏంచేయాలో పాలుపోని పరిస్థితుల్లో ఆష్లే తన ఎక్స్ అప్పటి ట్విట్టర్ ఖాతాలో రాష్ట్రపతి అఫీషియల్ ఖాతాకు ట్యాగ్ చేస్తూ తన సాయాన్ని కోరింది. వెంటనే ఆ విషయం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ దృష్టికెళ్లింది. ఇంకేం ఆయన ఆదేశాలతో రాష్ట్రపతి భవన్ అధికారులు తక్షణమే స్పందించారు. అలా రాష్ట్రపతి భవన్‌లో 2020 జనవరిలో ఆష్లే హాల్ పెళ్లికి రాష్ట్రపతి భవన్ వేదికైంది.

ఇప్పుడు సర్వీస్‌లో ఉన్న ఓ అధికారి వివాహానికి వేదికైన రాష్ట్రపతి భవన్ మరోసారి ఓ కొత్త అధ్యాయంతో వార్తల్లోకెక్కింది. రాష్ట్రపతి భవన్‌లోని మదర్ థెరీసా క్రౌన్ కాంప్లెక్స్‌లో పూనమ్‌గుప్తా వివాహ వేడుకలు జరుగనున్నాయి.

### అసలు పూనమ్ గుప్తా ఎవరంటారా..?

పూనమ్ గుప్తా 2018 యూపీఎస్సీ సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్సెస్ పరీక్షలో 81వ ర్యాంక్ సాధించి సీఆర్పీఎఫ్‌లో అసిస్టెంట్ కమాండెంట్‌గా తన సేవలందిస్తోంది. మధ్యప్రదేశ్ గ్వాలియర్‌లోని జివాజీ విశ్వవిద్యాలయం నుంచి బీఎడ్ కూడా పూర్తి చేసిన పూనమ్.. గణితంలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, ఆంగ్ల సాహిత్యంలో పీజీ పూర్తి చేసింది. 2024 గణతంత్ర వేడుకల కవాతులో సీఆర్పీఎఫ్ మహిళా బృందానికి నాయకత్వం వహించింది.

పూనమ్ గుప్తా ఇన్‌స్టా అకౌంట్ ద్వారా మహిళలను చైతన్యపర్చడం, పలు అంశాల్లో అవగాహన కల్పించడం వంటివాటితో సోషల్ మీడియాలోనూ ప్రోయాక్టివ్ ఉమ్యాన్‌గా పేరు తెచ్చుకుంది. బీహార్‌లో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లోనూ కమాండెంట్‌గా నాయకత్వం వహించారు.

పూనమ్ క్రమశిక్షణ, డ్యూటీ మైండ్‌సెట్, ఆమె సర్వీస్ ఇవన్నీ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును విశేషంగా ఆకట్టుకోవడంతో ఏకంగా తన పెళ్లి వేడుకకు రాష్ట్రపతి భవన్‌నే వేదికగా మార్చుకుని అపార గౌరవాన్ని, గుర్తింపునూ సంపాదించుకుంది.

– బాతాఖానీ.ఇన్ సౌజన్యంతో...

**ఎప్పుడో పుష్కర కాలం కిందట చేసిన సినిమా.. మదగజరాజా. అనివార్య కారణాలతో సుదీర్ఘ కాలం విడుదలకు నోచుకోని ఈ చిత్రం.. సంక్రాంతి కానుకగా తమిళంలో రిలీజై ఘనవిజయం సాధించింది. ఇప్పుడు తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్ర విశేషాలేంటో చూద్దాం పదండి.**

**కథ:**

మదగజరాజా (విశాల్) తన ఊరిలో కేబుల్ టీవీ వ్యాపారం చేస్తూ రాజాలా బతుకుతున్న కుర్రాడు. అతను ఒక కేసు పని మీద తన తండ్రితో కలిసి తన ఊరికి వచ్చిన మాధవి (అంజలి)తో ప్రేమలో పడతాడు. కానీ రాజా తండ్రి వాళ్లిద్దరిని అవమానించి ఊరి నుంచి పంపించేస్తాడు. ఆమె కోసం వెతుకుతుతున్న క్రమంలోనే తన చిన్ననాటి టీచర్ ఇంట్లో పెళ్లికి స్నేహితులతో కలిసి వెళ్తాడు రాజా. అక్కడ పెళ్లికూతురికి ఎదురైన సమస్యను పరిష్కరించి ఇంటికి బయల్దేరుదామని అనుకున్న సమయంలోనే తన స్నేహితుల్లో ఇద్దరు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నట్లు వెల్లడవుతుంది. వారి జీవితాలను అంధకారం చేసింది విశ్వనాథ్ (సోనూ సూద్) అనే బడాబాబు అని తెలుసుకుంటాడు రాజా. మీడియా అధినేతగా, రాజకీయాల్లో చక్రం తిప్పే వ్యక్తిగా తిరుగులేని స్థాయిలో ఉన్న విశ్వనాథ్ తో సామాన్యుడైన రాజా సమరానికి సై అంటాడు. ఈ క్రమంలో అతడికి ఎదురైన ఇబ్బందులేంటి.. వాటిని అధిగమించి విశ్వనాథ్ మీద అతను ఎలా విజయం సాధించాడు అన్నది మిగతా కథ.

**కథనం-విశ్లేషణ:**

హీరో కేబుల్ టీవీ నడిపే మామూలు కుర్రాడు. విలనేమో ఓవైపు టీవీ ఛానెళ్లు నడుపుతూ, ఇంకోవైపు పెద్ద పెద్ద వ్యాపారాలు చేస్తూ.. మరోవైపు రాజకీయాల్లో చక్రం తిప్పుతుంటాడు. తాను అభినందించడానికి వస్తే వెయిట్ చేయించాడని ఏకంగా ముఖ్యంత్రినే మార్చడానికి సిద్ధపడే లెవెల్లో ఉంటాడు విలన్. అతణ్ని కలవాలంటే అపాయింట్మెంట్ కోసం ఆరు నెలలు ఆగాల్సిన పరిస్థితి. అలాంటి వ్యక్తి ఇంటికి ఆవారాగాడిలా కనిపించే హీరో తాను సీబీఐ ఆఫీసర్ అని చెప్పి వెళ్లిపోతాడు. అంతే కాదు.. మా ఫ్రెండుకు ఇవ్వాల్సిన డబ్బులు ఇచ్చేయ్.. లేదంటే నిన్ను నడి రోడ్డు మీదికి తీసుకొచ్చేస్తా అని సవాల్ చేస్తాడు. చివరికి చెప్పినట్లే విలన్ని రోడ్డు మీదికి తీసుకొచ్చేస్తాడు కూడా. విలన్ ఎంత పెద్దవాడైనా.. సామాన్యుడైన హీరోకు ఎదురే లేనట్లు చూపించే ఇలాంటి సగటు కమర్షియల్ కథలు దశాబ్దాల కిందట వచ్చేవి. అయినా ఇప్పుడీ కథకు తమిళ ప్రేక్షకులు పట్టం కట్టేశారు. వాళ్లకు అంతగా ఇందులో ఏం నచ్చిందో కానీ.. తమిళ సినిమాలను ఎప్పుడో వెనక్కి నెట్టేస్తూ.. వినూత్నమైన కథలతో.. పెద్ద కాన్వాసుల్లో రూపొందుతున్న తెలుగు సినిమాలకు అలవాటు పడ్డ మన ప్రేక్షకులకు మాత్రం 'మదగజరాజా' చాలా సాధారణమైన సినిమాలాగే అనిపించొచ్చు. కొత్తదనం రవ్వంతైనా లేని ఈ చిత్రంలో కామెడీ.. యాక్షన్.. గ్లామర్.. ఇలా కమర్షియల్ సినిమాలకు అవసరమైన దినుసులన్నింటినీ లెక్కలేసి దట్టించాడు సుందర్.

'మదగజరాజా' ఆద్యంతం ఒక సగటు కమర్షియల్ సినిమా టెంప్లేట్లో సాగిపోతుంది. ఆపదలో ఉన్న హీరోయిన్-ఆమె తండ్రిని కాపాడ్డానికి సూపర్ హీరోలా ఎంట్రీ ఇచ్చి ఫైటింగ్ చేసే ఇంట్రో ఎపిసోడ్ నుంచి.. ప్రతి సీనూ ఎక్కడో చూసినట్లే అనిపిస్తుంది. తన వాళ్లకు కష్టమంటూ వస్తే ఏం చేయడానికైనా.. ఎక్కడిదాకా వెళ్లడానికైనా సిద్ధపడే హీరో పాత్ర మూస ధోరణిలో సాగుతుంది. ఐతే ఆరంభంలోనే సినిమా ఎలా ఉండబోతోందో ఒక అంచనా వచ్చేస్తుంది కాబట్టి.. దానికి అలవాటు పడిపోయి ఉన్నంతలో వినోదం వెతుక్కోవడానికి ప్రయత్నించాలి. ఎంత రొటీన్ గా సాగుతున్నా సరే.. సంతానం తన వింటేజ్ ఫాంను చాటుకుంటూ.. పంచుల వర్షం కురిపించడం 'మదగజరాజా'లో అతి పెద్ద రిలీఫ్. తన టైమింగుకి సూటయ్యేలా డబ్బింగ్ కూడా బాగా కుదరడంతో అతను స్క్రీన్ మీద కనిపించినపుడల్లా నవ్వులు పండుతాయి. విశాల్ నుంచి ఆశించే భారీ ఫైట్లకు ఢోకా లేదు. రెగ్యులర్ ఇంటర్వెల్స్‌లో అవి వస్తూ ఉంటాయి. ఇక అంజలి.. వరలక్ష్మి శరత్ కుమార్ గ్లామర్ విందు కూడా బాగానే చేశారు. ముఖ్యంగా వరలక్ష్మి రెచ్చిపోయి అందాలు ఆరబోసింది. హీరో ఏదో ఒక మంచి పని చేయడం.. లేదంటే మంచి మాట చెప్పడం.. అవతల హీరో యిన్లు ఫ్లాట్ అయిపోవడం.. అలా పాట అందుకోవడం.. ఇలా నరేషన్ పరంగా చాలా ఏళ్ల వెనక్కి తీసుకెళ్లాడు సుందర్.

'మదగజరాజా'లో ప్రధానంగా టైంపాస్ చేయించేది కామెడీనే. కథ పరంగా ఎక్కడా ఎగ్జైట్మెంట్ కలగదు. విలన్‌కు ఇచ్చే బిల్డప్పుకి.. అతడి ప్రవర్తనకు అసలు పొంతన ఉండదు. హీరోకు అసలు ఛాలెంజ్ అంటూ ఏమీ ఉండదు. చిన్న లాక్ వేయడం.. దాన్ని అతను ఛేదించి తాను ఏమనుకుంటే అది చేసేయడం.. ఇలా వన్ సైడెడ్‌గా నడుస్తుంది కథ. అలాంటపుడు ఇక కథలో సంఘర్షణ ఏముంటుంది? చచ్చిపోయిన వ్యక్తిని బతికున్నట్లుగా చూపించి డ్రామా నడుపుతూ కామెడీ పండించే ప్రయత్నం ఎన్నో సినిమాల్లో చూశాం. ఇటీవలే 'సంక్రాంతికి వస్తున్నాం'లోనూ చూసిన అదే కామెడీని.. ఇందులో ఒక లెంగ్తీ ఎపిసోడ్ గా పెట్టారు. రెండేళ్ల కిందటే చనిపోయిన మనోబాల ఆ పాత్రలో కనిపించడం చూసి నవ్వాలో బాధ పడాలో అర్థం కాదు. పన్నెండేళ్ల కిందటే చనిపోయిన మణివణ్ణన్ సైతం ఇందులో ఒక పాత్ర చేయడం గమనార్హం. కథకు తోడు ఈ పాత్రలు.. ముఖ్య పాత్రధారుల లుక్స్.. ఇదెంత పాత సినిమా అనే విషయాన్ని గుర్తు చేస్తూ ఉంటాయి. కాబట్టి 'మదగజరాజా' మన ప్రేక్షకులకు ఏమాత్రం ఎక్కుతుంది అన్నది సందేహమే.

– తుపాకి.కామ్ సౌజన్యంతో...

**నటీనటులు:** విశాల్‌కు ఇలాంటి మాస్ పాత్రలు కొట్టిన పిండి. తన ఆహార్యానికి.. ఇమేజ్‌కు సరిపోయే మాస్ పాత్ర కావడంతో అతను చాలా హుషారుగా నటించాడు. 12-13 ఏళ్ల ముందు చేసిన సినిమా కావడంతో అప్పుడు తన లుక్ కూడా బాగుంది. యాక్షన్ సీక్వెన్సుల్లో ఎప్పట్లాగే అదరగొట్టాడు. అంజలి కెరీర్ ఆరంభంలో చేసిన సినిమా కావడంతో తన నటనలో ఇప్పుడున్న పరిణతి కనిపించదు. పెద్దగా నటించడానికి స్కోప్ ఉన్న పాత్ర కూడా కాదు. గ్లామర్ పరంగా మాత్రం ఆకట్టుకుంది. గత కొన్నేళ్లలో తెలుగులో విలక్షణ పాత్రల్లో అదరగొట్టిన వరలక్ష్మిని ఇందులో గ్లామర్ గర్ల్‌గా చూసి ఆశ్చర్యపోతాం. అందాల ఆరబోతలో ఆమె ఏమాత్రం తగ్గలేదు. విలన్ పాత్రలో సోనూ సూద్ రొటీన్ అనిపిస్తాడు. ఇలాంటి పాత్రలు ఆయన చాలానే చేశాడు. సంతానం కామెడీ సినిమాలో మేజర్ హైలైట్. అతడి కామెడీనే లేకుంటే.. 'మదగజరాజా'ను తటుకోవడం కష్టమయ్యేది. సుబ్బరాజు.. సుధ.. సత్యకృష్ణ.. గాయత్రిరావు లాంటి తెలుగు నటులు ఇందులో నటించారు. ఐతే వాళ్ల పాత్రలకు ప్రాధాన్యం అంతంతమాత్రమే. మిగతా ఆర్టిస్టులంతా తమ తమ పాత్రల పరిధి మేరకు నటించారు.




**సాంకేతిక వర్గం:** ఇప్పుడు హీరోగా బిజీగా ఉన్న విజయ్ ఆంటోనీ.. కేవలం సంగీతానికే పరిమితమైన రోజుల్లో చేసిన సినిమా ఇది. ఒక సగటు మాస్ మూవీకి అవసరమైన సంగీతాన్ని అందించాడతను. పాటలు ఊర మాస్ గా సాగుతాయి. కొంచెం శబ్ద కాలుష్యం ఎక్కువైన ఫీలింగ్ కలుగుతుంది. నేపథ్య సంగీతం ఓకే. రిచర్డ్ ఎం.నాథన్ ఛాయాగ్రహణం బాగుంది. నిర్మాణ విలువలు ఈ సినిమా తీసిన రోజుల ప్రమాణాల మేరకు బాగానే ఉన్నాయి. ఇక కథకుడు-దర్శకుడు సుందర్.సి అంటేనే రొటీన్ మాస్ సినిమాలకు పెట్టింది పేరు. సినిమా ఆయన స్టయిల్లో సాగిపోయింది. కామెడీ విషయంలో తన బలాన్ని సుందర్ మరోసారి చూపించాడు. అంతకుమించి సుందర్ ప్రత్యేకంగా చేసిందేమీ లేదు. రొటీన్ కథను అంతే రొటీన్ గా నరేట్ చేశాడు.

# రొటీన్ మాస్‌రాజా!

# 'నాక్'గా తప్పించారు!

(మొదటిపేజీ తరువాయి)

తెప్పించుకుంటున్న వీరు ఇప్పుడు నాక్ ఎ-గ్రేడ్ కాలేజీకి వస్తే సురేఖకు మైలేజీ పెరుగుతుందని జిల్లా భవిష్యత్తును ఫణంగా పెట్టేశారు. గతంలో అనేక ఫిర్యాదులు ప్రిన్సిపాల్ మీద చేయడం, విచారణలు జరగడం, ఆ నివేదికలు ఏమయ్యాయో తేలకపోవడం, ఆమెకు బదిలీ కావడం, కోర్టును ఆశ్రయించడం, మళ్లీ ఇక్కడికే రావడం.. ఇవన్నీ ఒక లెక్క. కానీ నాక్ ఎ-గ్రేడ్ రాకుండా అడ్డుకోవడం మాత్రం క్షమించరాని నేరం. నాక్ బృందానికి ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేసిన అంశంలో వాస్తవాలు ఉంటే ఉండొచ్చుగాక. లేదూ అంటే కేవలం సురేఖను బలిపశువును చేయడానికే నాలుగు వాక్యాలు పేర్చివుండొచ్చు కూడా. ఏం జరిగినా నాక్ ఎ-గ్రేడ్ రావడానికి కావలసిన నార్మ్స్ అన్నీ ఆర్ట్స్ కళాశాలకు ఉండకపోవచ్చు. అలా అని రాష్ట్రంలో ఉన్న నాక్ ఎ-గ్రేడ్ సంస్థల్లో 100 శాతం ఈ నార్మ్స్‌తోనే ఉన్నాయని ఎవరైనా చెప్పగలరా? శ్రీకాకుళంలో ఉన్న రిమ్స్ కాలేజీ నుంచి సిద్ధిపేట వద్ద ఉన్న డెంటల్ కాలేజీ వరకు, పక్కనే ఉన్న రాగోలు జెమ్స్ మెడికల్ కాలేజీలో సీట్లు పెంచాలన్నా, పీజీకి అప్‌గ్రేడ్ చేయాలన్నా, మెడికల్ కౌన్సిల్ అనుమతి కావాలన్నా వేరేచోట నుంచి ఆ బృందం వచ్చినప్పుడు వైద్యులను తెచ్చి ఓ షో చేస్తుంటారు. ఈ విషయం చదువులు చెప్పే అధ్యాపకులకు తెలియనిది కాదు. ఎందుకంటే.. ఒకసారి నాక్ లాంటి వ్యవస్థలు ఎ-గ్రేడ్, మెడికల్ కౌన్సిల్ లాంటివి అనుమతులు ఇస్తే అక్కడి విద్యార్థుల, అధ్యాపకుల భవిత బాగుంటుంది. అందుకే ఆ సమయంలో అందరూ కలిసికట్టుగా పని చేస్తారు. సిద్ధిపేటలో ఉన్న డెంటల్ కాలేజీ ప్రైవేటుదే అయినా అక్కడి మేనేజ్‌మెంట్‌కు, ఫ్యాకల్టీకి మధ్య ఎన్ని పొరపొచ్చాలు ఉన్నా మెడికల్ కౌన్సిల్ పర్యవేక్షణకు వచ్చినప్పుడు మాత్రం తమకు మించిన కాలేజీ లేదనే చూపిస్తున్నారు. ఆర్ట్స్ కాలేజీ ప్రభుత్వానిదైవుండి సురేఖకు ఎక్కడ పేరొస్తుందోనని కుట్రకు పాల్పడినవారు ఆర్ట్స్ కళాశాల చరిత్రను తెలుసుకుంటే మంచిది. తరగతి గదుల్లో స్లాబుకు కొన్నిచోట్ల పెచ్చులూడుతున్నాయని మరీ ఫిర్యాదు చేసినవారికి నాక్ ఎ-గ్రేడ్ వస్తే నిధులు ఎక్కువ మంజూరవుతాయని, దాంతో కళాశాలను బాగుచేసుకోవచ్చన్న విషయం తెలియకపోవడం విడ్డూరం. ముఖ్యంగా సురేఖను ఇక్కడి నుంచి పంపేసి ప్రతిష్ఠాత్మకమైన ఆర్ట్స్ కాలేజీలో తిష్ఠ వేయడానికి ఎప్పట్నుంచి ఆకాశరామన్న యుద్ధాలు జరుగుతున్నాయి. జిల్లా కలెక్టర్ మొదలుకొని ఉన్నత విద్య కమిషనరేట్ వరకు సురేఖ మీద ఉన్నన్ని ఫిర్యాదులు రాష్ట్రంలో మరో కళాశాల ప్రిన్సిపాల్ మీద లేవు. వీటిని క్లియర్ చేసి సురేఖ తప్పు చేశారని నిరూపించి ఆమెను బదిలీ చేయించడం ఒక ఎత్తు. లేదా మరో చర్యలు తీసుకోవాలని కోరడంలో తప్పు లేదు. కానీ నాక్ గ్రేడ్‌ను దిగజార్చడం మాత్రం ముమ్మాటికీ తప్పే. కాలేజీకి ఎ-గ్రేడ్ వస్తే సురేఖ ఇంటికి సున్నాలు పడవు. కాలేజీ గోడలకే నాలుగు రంగులద్దుకోవచ్చు. ఇక్కడ ఇది మనది అని భావించి పాఠాలు చెబుతున్న అధ్యాపకులకు మరో నాలుగు రూపాయల జీతం పెరుగుతుంది. ఇవన్నీ పట్టకుండా విశాఖపట్నం నుంచో, మరో చోట నుంచో అప్ అండ్ డౌన్ చేస్తూ ఈ జిల్లాలో పని చేయడానికి ఏమాత్రం ఇష్టపడని కొందరు, పాఠాలు చెప్పడం కంటే రాజకీయాలు చేయడానికే ప్రాముఖ్యతనిచ్చే మరికొందరు, లెక్చరర్ అనిపించుకోవడం కంటే జిల్లా అధికారిని పిలిపించుకోవాలన్న కోరికతో ఇంకొందరు కళాశాలకు రావాల్సిన నాక్ గ్రేడ్‌ను నాక్‌గా తప్పించారు. కారణమేంటయ్యా అంటే.. సురేఖ చేతకానితనమని పేరు పెట్టారు.

# విద్యార్థినులు క్రమశిక్షణతో మెలగాలి

❑ నిందితులను కఠినంగా శిక్షిస్తున్నాం

❑ శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



విద్యార్థినులు క్రమశిక్షణతో మెలగాలని, చదువుపై దృష్టి పెట్టి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వద్ద జనవరి 30న విద్యార్థినిపై జరిగిన దాడి గురించి ఎమ్మెల్యే శనివారం ఆరా తీశారు. ఈ సందర్భంగా వార్డెన్‌కు మద్దతుగా విద్యార్థినులు ర్యాలీకి సిద్ధమవుతుండడంతో ఇటువంటి చర్యలకు విద్యార్థినులు పాల్పడవద్దని, సంయమనం పాటించాలని హితవు పలికారు. చట్టం ముందు అందరూ సమానమని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని వివరించారు. పోలీసు దర్యాప్తు కొనసాగుతోందని త్వరలోనే నిందితులను పట్టుకుంటారని చెప్పారు. కళాశాల మైదానంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం సరికాదని, నిర్వాహకులపై కూడా చర్యలు తీసుకుంటామని వివరించారు. అనంతరం ప్రిన్సిపల్ సూర్యచంద్రరావుతో మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థినులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కళాశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం జూనియర్ కళాశాలతో పాటు, ఆరు హాస్టల్స్‌ను పరిశీలించారు. విద్యార్థినులకు రక్షణ కల్పిస్తామని త్వరలోనే కేంద్ర, రాష్ట్ర మంత్రులతో, జిల్లా ఉన్నతాధికారులతో చర్చించి హాస్టల్‌లో ప్రహరీ గోడ నిర్మాణం కూడా చేపడతామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేతో పాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణవేణి, కళాశాల సిబ్బంది ఉన్నారు.




కాన్సర్‌పై అవగాహన తప్పనిసరని మానవత స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్ష్యులు లైన్ పొన్నాడ రవికుమార్ అన్నారు. గాయత్రి కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజిమెంట్ కళాశాలలో మానవత స్వచ్ఛంద సేవ సంస్థతో కలసి డిపార్ట్మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ అండ్ ఐక్యూఏసి సంయుక్తంగా శనివారం కాన్సర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యురాలు మానవత స్వచ్ఛంద సేవ సంస్థ వైద్య విభాగ చైర్‌పర్సన్ లైన్ డాక్టర్ పైడి సింధూర, చైర్మన్ ప్రొఫెసర్ లైన్ డాక్టర్ విష్ణుమూర్తి, గురజాడ విద్యా సంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు, ప్రిన్సిపాల్ డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

- సత్యంన్యూస్, శ్రీకాకుళం

## హాస్టల్ విద్యార్థిని కేసులో
# నిందితుడు దొరికాడు!

(మొదటిపేజీ తరువాయి)

నుంచి మరిన్ని వివరాలు సేకరించడంతో అప్పటి వరకు అనుమానితుడిగా ఉన్నవాడు, తాము వెతుకుతున్న నిందితుడు ఒకడేనని పోలీసులు నిర్ధారించుకొని అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలి కాల్‌డేటాలో ఉన్న నెంబరు, హాస్టల్‌కు వచ్చినట్టు చూపిస్తున్న వీడియో ఫుటేజ్, బస్సులో దొరికిన మొబైల్ ఫోన్, గోవర్ధనపురానికి చెందిన వ్యక్తి ఒకడేనని నిర్ధారించుకున్న తర్వాత పోలీసులు విచారణ ప్రారంభించారు. బాధితురాలి సమ్మతి మేరకే నిందితుడు హాస్టల్‌కు వచ్చినట్టు ప్రాథమికంగా గుర్తించినట్టు తెలుస్తుంది. వీరిద్దరి మొబైల్ డేటా ఆధారంగా ఎప్పట్నుంచో వీరికి పరిచయం ఉందని, బహుశా బాధితురాలికి బాయ్‌ఫ్రెండ్ అయివుంటాడని పోలీసులు భావిస్తున్నారు. అయితే దాడి ఎందుకు చేశాడన్న దానిపై మాత్రం పూర్తి వివరాలు సేకరించే పనిలో పోలీసులున్నారు.

## ఆలయ కమిటీల్లో వైశ్యులకు అవకాశం ఇవ్వాలి

**- టీడీపీ వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి హరిగోపాల్ -**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ఆలయాల పాలక మండల్లో దైవచింతన కలిగిన కళింగకోమట్లు (వైశ్యులు)కు ప్రాధాన్యం ఇచ్చి అవకాశం కల్పించాలని టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కోరాడ హరిగోపాల్ పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు, పార్టీ జాతీయ కార్యదర్శ నారా లోకేష్‌లను కోరారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలయాల పాలక మండళ్ల నియామకంలో బ్రాహ్మణ, నాయీబ్రాహ్మణ సామాజిక వర్గాలతో పాటు కళింగ కోమట్లకు చోటు కల్పించాలని ప్రభుత్వ పెద్దలను కోరారు. పాలక మండళ్ల నియామకం కోసం ప్రతిపాదనలు పంపే సమయంలో కళింగ కోమట్లలో పార్టీ కోసం పని చేసిన వారి పేర్లను పరిగణలోక తీసుకోవాలని ఎమ్మెల్యేలకు ఒక డైరెక్షన్ ఇవ్వాలని కోరారు. సీఎం చంద్రబాబు పట్ల పూర్తి విశ్వాసం కలిగి దైవచింతన, సేవాభావంతో పనిచేసే కళింగ కోమట్లను ఆలయ పాలక మండలిల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరారు.

## నిందితులను కఠినంగా శిక్షించాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులు చాలా బాధాకరమని అఖిల భారతి విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిగిలిపల్లి మదన్ కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిర్భయ, దిశా, కోల్‌కతా ట్రైనీ డాక్టర్ ఉదంతాలు మరువకముందే జిల్లాలో మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినిపై దాడి జరగడం అందరి మనసులను కలిచివేసిందని తెలిపారు. దీనికి కూటమి ప్రభుత్వం బాధ్యత వహించి, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేకపోతే అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తీవ్ర ఆందోళన చేయడానికి సిద్ధంగా ఉందని తెలిపారు.

## హైరిస్క్ పేషెంట్‌కి అరుదైన చికిత్స

**- మెడికవర్ యూరాలజిస్ట్ డాక్టర్ సందీప్ -**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

హైరిస్క్ కార్డియాక్ పేషెంట్‌కి పెర్క్యుటేనియస్ నెఫ్రోలిథోట్రిప్సీ (పీసీఎన్ఎల్) శస్త్రచికిత్సను స్థానిక మెడికవర్ హాస్పిటల్ వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. ఈ మేరకు శనివారం యూరాలజిస్ట్ డాక్టర్ ఎస్.సందీప్ వర్మ కోసూరి ఒక ప్రకటన విడుదల చేశారు. పెద్ద మూత్రపిండలో ఏర్పడే రాళ్ల వల్ల తరచు పునరావృతమయ్యే అంటువ్యాధులకు గురై మూత్రపిండాలు బలహీనమై వాటి పనితీరుపై తీవ్ర ప్రభావం చూపుతాయని తెలిపారు. పీసీఎన్ఎల్ సమర్థవంతమైన చికిత్స అయినప్పటికీ తీవ్రమైన కార్డియాక్ కోమొర్బిడిటీలకు తగిన పెరియోపరేటివ్ విధానం అవసరమన్నారు. మెడికవర్ హాస్పిటల్‌లో 50 ఏళ్ల హైరిస్క్ కార్డియాక్ రోగి కేశవరావుకు పీసీఎన్ఎల్ విధానంలో అనేక సవాళ్లను ఎదుర్కొని శస్త్రచికిత్సను పూర్తి చేసినట్టు పేర్కొన్నారు. గుండె పనితీరును అంచనా వేయడానికి ఎకోకార్డియోగ్రఫీ, ఈసీజీ, ఒత్తిడి పరీక్ష నిర్వహించినట్టు తెలిపారు. ప్రీప్రొసీజర్ బ్రిడ్జింగ్ థెరపీతో ప్రతిస్కందకం నిర్వహించామన్నారు. హృదయ సంబంధ ఒత్తిడిని తగ్గించడానికి ప్రాంతీయ అనస్థీషియాకు ప్రాధాన్యత ఇచ్చినట్టు తెలిపారు. పెర్క్యుటేనియస్ ట్రాక్ట్ ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. అల్ట్రాసోనిక్, లేజర్ లిథోట్రిప్సీతో 3 సెం.మీ కాలిక్యులస్‌ను తొలగించినట్టు తెలిపారు. స్టెంట్‌ను సురక్షితంగా తొలగించినట్టు తెలిపారు. రోగి శరీరంపై ఒత్తిడి, ఓవర్‌లోడ్‌ను నివారించడానికి కచ్చితమైన ద్రవ సమతుల్యతను పాటించినట్టు తెలిపారు. హిమోడైనమిక్ స్థిరత్వం నిశితంగా ఉండేలా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. కార్డియాక్ రిస్క్ కారణంగా మొదటి 24 గంటలు ఐసీయూ పర్యవేక్షణలో ఉంచినట్టు తెలిపారు. కార్డియాలజీ, యూరాలజీ నిపుణులు సలహాలు, సూచనలతో శస్త్రచికిత్స అనంతరం రోగుల పర్యవేక్షణలో కొన్ని రోజులు ఉంచి అన్నివిధాల కోలుకున్న తర్వాత డిశ్చార్జ్ చేసినట్టు తెలిపారు. శస్త్రచికిత్సకు ముందు ప్రణాళిక ప్రకారం పెరియో పరేటివ్ కేర్‌తో హైరిస్క్ కార్డియాక్ రోగులలో పీసీఎన్ఎల్‌ను సురక్షితంగా నిర్వహించవచ్చని ఈ శస్త్రచికిత్స నిరూపించిందన్నారు. ఈ సందర్భంగా డిశ్చార్జ్ సమయంలో రోగి బంధువులు మెడికవర్ వైద్యులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

## రథసప్తమికి పకడ్బందీ ఏర్పాట్లు

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టాలని అధికారులు ఆదేశించారు. ఆలయం లోపల క్యూలైన్లలో ఒకే సమయంలో అధిక సంఖ్యలో భక్తులు రద్దీ లేకుండా అవసరమైన బారికేడ్లు, సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వాహనాల పార్కింగ్ నిమిత్తం నిర్దేశించిన ఎల్ఎన్ ఫంక్షన్ హాల్, అరసవిల్లి ఎంపీయూపీ పాఠశాల, వాడాడ జంక్షన్, 80 అడుగుల రహదారి మార్గంలో ఏపీహెచ్‌బీ కాలనీ వద్ద గల పార్కింగ్ ప్రదేశాలను పోలీసు అధికారులతో పరిశీలించి వాహనాలు రాకపోకలకు, పార్కింగ్ చేసేందుకు ఎటువంటి ఆటంకం లేకుండా అన్ని విధాల చర్యలు చేపట్టాలన్నారు. రెండవ తేదిన 80 ఫీట్ రోడ్డు మార్గంలో జరగనున్న సూర్యనమస్కారాలు, శోభాయాత్ర కార్యక్రమం, డచ్ బంగ్లా వద్ద ఆ హెలిక్యాప్టర్ టూరిజం, ఆర్ట్స్ కళాశాల మైదానంలో మూడవ తేదీన జరగనున్న సాంస్కృతిక కార్యక్రమాలకు బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించి వీక్షకులు, భక్తులకు నిర్దేశించిన పార్కింగ్ ప్రదేశాలను ఎస్పీ పరిశీలించారు. మూడు రోజుల పాటు జరిగే రథసప్తమి వేడుకల సందర్భంగా అధిక సంఖ్యలు భక్తుల రద్దీ దృష్ట్యా పట్టణంలో ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులకు ఎస్పీ ఆదేశించారు. ప్రతి బందోబస్తు పాయింట్‌లను పరిశీలించి అవసరమైన సిబ్బందిని నియమించుకోవాలని సూచించారు. ఈ పరిశీలనలో శ్రీకాకుళం పట్టణ డీఎస్పీ సిహెచ్ వివేకానంద, సీఐలు పైడపు నాయుడు, ఇమాన్యువల్ రాజు, నాగరాజు, ఈశ్వరరావు, ఎస్సైలు హరికృష్ణ, గణేష్ కృష్ణారావు తదితరులు ఉన్నారు.

# 'యమ్మీ' ఫుడ్ డెలివరీ యాప్ ప్రారంభం

సత్యంన్యూస్, శ్రీకాకుళం




శ్రీకాకుళం హోటల్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ హోటల్ అసోసియేషన్ (ఏపీ హెచ్ఏ) అనుబంధంతో 'యమ్మీ' అనే కొత్త ఫుడ్ డెలివరీ యాప్‌ను శనివారం ప్రారంభించింది. అపా కార్యదర్శి మెట్ట నాగరాజు (హోటల్ మినర్వా), శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ హొటల్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు వరదా వెంకట్ ఆనంద్ (హోటల్ వరదా నాగావళి), వరదా ఆశిష్ (హోటల్ వరదా నాగావళి), అపా జాయింట్ సెక్రటరీ గజరావు వినోద్‌కుమార్ (హోటల్ ఎస్వీడీ), శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ హోటల్ అసోసియేషన్ సెక్రటరీ సువ్వారి వెంకట సతీష్ (హోటల్ గ్రాండ్), శ్రీకాకుళం టౌన్ హోటల్ అసోసియేషన్ సెక్రటరీ తుంబలి సుదర్శన్ (గజపతి టిఫిన్స్ అండ్ కేటరింగ్), మద్ది కొండలరావు (అయ్యప్ప ఫుడ్ ఎక్స్‌ప్రెస్), ఎంజీ అపా ప్రతినిధి దుర్గా భాస్కర్ తదితరుల చేతుల మీదుగా ఈ యాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది ప్రఖ్యాత ఫుడ్ డెలివరీ సేవలైన స్విగ్గీ, జొమాటోలకు ప్రత్యామ్నాయంగా అభివృద్ధి చేయబడిందన్నారు. ఇటీవల కాలంలో స్విగ్గీ, జొమాటో వంటి ఫుడ్ డెలివరీ సంస్థలు రెస్టారెంట్ల నుంచి అధిక కమిషన్, ప్రచార రుసుము వసూలు చేస్తున్నాయని, ఇది చిన్న, మధ్య తరహా రెస్టారెంట్లకు ఆర్థికంగా భారంగా మారిందని తెలిపారు. ఈ కారణంగా వినియోగదారులకు కూడా భోజన ధరలు పెరిగి, వారి ఖర్చులు ఎక్కువయ్యాయని, ఈ సమస్యను పరిష్కరించేందుకు శ్రీకాకుళం హోటల్ అసోసియేషన్ సభ్యులు 'యమ్మీ' యాప్‌ను తీసుకువచ్చి తమ సొంత డెలివరీ సేవను ప్రారంభించినట్లు తెలిపారు. ఈమేరకు శనివారం శ్రీకాకుళం హోటల్ అసోసియేషన్ సభ్యులు ఈ యాప్‌ను అధికారికంగా ప్రారంభించారు. వినియోగదారులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసి తమకు ఇష్టమైన ఆహారాన్ని ఆర్డర్ చేసుకోవచ్చన్నారు.




## సూర్య నమస్కారాలతో రథసప్తమికి రేపే శ్రీకారం

(మొదటిపేజీ తరువాయి)

10 గంటల వరకు ఆర్ట్స్ కళాశాల మైదానంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. ఆరోహి స్కూల్ ఆఫ్ మ్యూజిక్, దుంపల ఈశ్వర్ బృందం, యామినీ కృష్ణ బృందం, పరిమళ బృందం, అనురాధ బృందం, లక్ష్మీగణపతి శర్మ బృందం తమ ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించనున్నారు. హైపర్ ఆది, ఫైమా, ఢీ భూమిక, రేలారే రేలా టీమ్, మిమిక్రీ ఆనంద్, జోష్ శివ, పిన్నీ సాంగ్ ఫేమ్ షన్ముఖ, సురేష్ రేష్మ, బాలాజీ వంటి ప్రముఖులు ధూంధాం కార్యక్రమంలో పాల్గొంటారు.

**ప్రత్యేక ఆకర్షణ కానున్న లేజర్ షో:**

రాత్రి 7 గంటల నుంచి 8 గంటలకు వరకూ గంటపాటు ఆహుతులను అలరించేలా లేజర్ షో ఏర్పాటు చేశారు. రాత్రి 9 గంటల నుంచి శ్రీ అంజనా కళా సంస్థ నేతృత్వంలో ఆంధ్రరాష్ట్రంలో పేరుపొందిన నటీనటులతో పంచరత్నాలు పౌరాణిక నాటకాలు ప్రదర్శిస్తారు. మయసభ పడక సీను, శ్రీరామాంజనేయ యుద్ధం, భక్త చింతామణి, గయోపాఖ్యానం, శ్రీ సత్యహరిశ్చంద్ర వారణాశి నుంచి ప్రారంభం వంటి నాటకాలను ప్రదర్శిస్తారు. ఈ కార్యక్రమాలన్నీ ఉచితంగా వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు.

**కోటి రామ్మూర్తి స్టేడియంలో పార్కింగ్:**

ఆర్ట్స్ కళాశాల మైదానంలోనే ఫుడ్‌కోర్టులు అందుబాటులో ఉంచారు. ప్రముఖ హొటల్స్, స్థానిక హొటళ్లతో కలిపి అందుబాటు ధరలోనే ఆహార పదార్థాలు లభించేలా చర్యలు తీసుకుంటున్నారు. కోడి రామ్మూర్తి స్టేడియంలో పార్కింగ్, మరుగుదొడ్ల సౌకర్యాన్ని కల్పించారు. ఈ వేడుకలకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని అంచనా వేస్తున్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.